ChimataMusic.com
Patha Patala Parnasala

# Site's 3rd Anniversary Editorial

*by Srini Chimata*

సిరిమల్లె పువ్వు.. కురిసింది నవ్వు

నెలరాజు అందం.. వేసింది బంధం..

ఆ బంధమే మరీ మరీ ఆనందమె!!

(జమీందారు గారి అమ్మాయి (1975) నుండి "మ్రోగింది వీణ" పాట

గీత రచన: దాశరధి; సంగీతం: జి.కె.వెంకటేష్; గాయని: పి. సుశీల)

ChimataMusic.com

చిమటమ్యూజిక్.కామ్ తృతీయ జన్మదిన సందర్భముగా మీ అందరి ఆదరాభిమానాలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.. ఈ మూడు సంవత్సరాలు మూడు నెలలుగా గడిచాయంటే అతిశయోక్తి కాదు. గత రెండు సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా చాలామంది అద్భుతమైన కొత్త స్నేహితులు మళ్ళీ ఈ సైట్ ద్వారా పరిచయం అయ్యారు. సైట్ పాపులారిటీ గత సంవత్సరంకంటే దాదాపుగా మూడు రెట్లు పెరిగింది.

ఈ సంవత్సరం దుఃఖపూరితమైన ఒక విషాద సంఘటనను మరియు పది కాలాల పాటుగా గుండెల నిండుగా పదిలంగా దాచుకునే ఒక మధురానుభూతిని మిగిల్చింది. నా అభిమాన నటుడు శోభన్‌బాబు ఆకస్మిక మరణం (మార్చి 20, 2008) మనందరికీ ఒక తీరని లోటయితే... బాలు గారితో ముఖపరిచయం, గంటల తరబడి ఆయన హుషారుగా తను పాడిన పాటల గురించి, తనకు నచ్చిన సంగీత దర్శకుల తాలూకు జ్ఞాపకాలను నాతో పంచుకోవటంతో నా చిరకాల స్వప్నం సాకారం అయ్యినట్లే..

శోభన్‌బాబుకు వీరాభిమాని అయిన విజయభాస్కర్ తుమ్మల (అనంతపురం) గారి సహకారంతో శోభన్‌బాబు.కామ్ అనే కొత్త వెబ్‌సైట్‌ను శోభన్‌బాబు గారి పెద్దకర్మ రోజున రిలీజ్ చేశాం. ఈ వెబ్‌సైట్‌కి అత్యంత కీలకమైన "డిస్కషన్ బోర్డ్" లో విజయభాస్కర్ గారి సారధ్యంలో అన్ని హీరోల సినిమాల మీద సమగ్రమైన విషయ సేకరణ (సినిమా రి వ్యూలు, రికార్డులు,

పేపర్‌క్లిప్స్, ఇంటర్వ్యూలు, అరుదైన ఫోటోలు) జరుగుతున్నది. దీంతో పాటుగా కొంతమంది ఔత్సాహికులైన సంగీతాభిమానులు (ఏజెంట్ 116, **DW**, హనుమాన్, విజయభాస్కర్, వెన్నెల, సిరిమల్లి, రాము, సూర్య, విశ్వనాధ్, ప్రదీప్, మూవీ లవర్, మారుతి, నందకిషోర్ తదితరులు) చురుగ్గా పాల్గొంటున్న "సినిమా క్విజ్" కూడా ఈ వెబ్‌సైట్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది.

శోభన్‌బాబు.కామ్ డిస్కషన్ బోర్డ్ పెట్టాక, చిమటమ్యూజిక్ డిస్కషన్ బోర్డ్ లో డిస్కషన్స్ మునుపటిలాగా చురుకుగా జరగటం లేదన్నది వాస్తవం. సైట్‌లో లేని పాటలను శ్రోతలు **request** చెయ్యడానికి దీన్ని ఎక్కువగా వాడుతున్నారు. ప్రొఫెసర్ సూర్యప్రకాష్ గారు, నందకిషోర్, శాంతారాం, సూర్య తదితరులు తమ ఇన్‌ఫర్మేటివ్ **posts** తో ఈ డిస్కషన్ బోర్డ్‌ని ముందుకు తీసుకెళుతున్నారు. వీరందరినీ నా మనసారా అభినందిస్తున్నాను.

ఈ సంవత్సరం ఫిబ్రవరిలో జే.వి. రాఘవుల గారి దయనీయ ఆర్ధిక పరిస్థితిని సూర్య గారు ఈనాడులో చదివి ఆ వెబ్‌పేజి లింక్‌ని మన డిస్కషన్ బోర్డ్‌లో పెట్టారు. జే. మారుతీకుమార్ (అట్లాంటా, **GA**) మొట్టమొదటగా స్పందించి ధన సహాయం చెయ్యడానికి ముందుకొచ్చారు. అతని ఉత్సాహం ఒక మంచి పనికి పూనుకోవడానికి నాకు స్ఫూర్తినిచ్చింది. మన వెబ్‌సైట్ తరుపున కొన్ని విరాళాలు సేకరించి నాటి మేటి సంగీత దర్శకులకు ఆఖరి ప్రతీకగా మిగిలివున్న రాఘవులు గారిని తన అవసానదశలో ఆదుకోవడం మన కనీస కర్తవ్యమని భావించాను. సూర్య గారు కూడా ఇదొక మంచి పని అని నన్ను ప్రోత్సహించటంతో, "జే.వి. రాఘవులు సహాయ నిధి" ని ఏర్పాటు చేసి మూడు వారాలలో దాదాపుగా పదివేల డాలర్లు సేకరించగలిగాము. ఇదంతా కేవలం మన సైట్ శ్రోతలకు పాత పాటల మీద మమకారం వల్ల, మేము చేస్తున్నది ఒక గొప్ప కార్యమని వారు భావించడం వల్లనే సాధ్యమయ్యింది. హైదారాబాద్‌లో నా ప్రాణమిత్రుడు సురేష్ మంత్రాల ఆధ్వర్యంలో మార్చి 16న ముఖ్య అథిదులుగా విచ్చేసిన గానకోకిల పి.సుశీల, సి.నారాయణ రెడ్డి గార్ల సమక్షంలో రాఘవులుగారిని ఘనంగా సన్మానించాము. సురేష్ ఆ సమయంలో హైదరబాద్‌లో లేనట్లయితే ఆ సన్మాన సభ ఏర్పాటుకు సాహసించేవారమే కాదు. రాఘవులు గారికి రెండు లక్షల రూపాయిలు ఫిక్స్‌డ్ డిపాజిట్ సర్టిఫికేట్‌గా ఇచ్చి, మిగతా మొత్తాన్ని అత్యవసర వైద్య సహాయ నిమిత్తం నగదు రూపాన ఆయనకు అందచేశాము. రాఘవులు గారికి మనం చేసిన సన్మానం వెలుగులోకి వచ్చిన తరువాత రాఘవులు గారు **TV** మీడియా, కొన్ని సహాయసంస్థల దృష్టిలో పడి, వారి ద్వారా మరికొంత ధనసహాయం పొందారని తెలిసి చాలా సంతోషించాము.

ChimataMusic.com

నేను కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఈ సంవత్సరం తగినంత సమయాన్ని వెబ్‌సైట్ నిర్వహణకు కేటాయించలేకపోవడం వల్ల, సూర్య గారే దాదాపుగా సైట్ ని రన్ చేస్తున్నారు. **Back-end** లో సూర్య గారు ఈసారి చాల **coding** చేశారు. వృత్తిరీత్యా

ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాకపోయినప్పటికీ (తన self-employed cable business తో బిజీగా ఉంటూ కూడా), కేవలం హాబీ లాగా ప్రోగ్రామింగ్ నేర్చుకోవటమనేది నన్ను నిజంగా అబ్బురపరిచే విషయం. php కోడింగ్‌ని కేవలం కొద్ది రోజుల్లోనే నేర్చుకొని ఈ సైట్‌కి కావల్సిన కొత్త features ని ఆయన అందించగలుగుతున్నారంటే అది నిజంగా ఒక అపురూపమైన విషయం. గత సంవత్సరం నుండి సైట్‌కి తెలుగు వర్షన్ తీసుకొచ్చారు. రెగ్యులర్‌గా కొత్త పాటలని అప్‌లోడ్ చేస్తున్నారు. 1000 పాటలకు పైగా గీత రచయతల పేర్లను సేకరించారు. ఎప్పటికప్పుడు guestbook నుండి, డిస్కషన్ బోర్డ్ నుండి కొత్త పాటల request లను సేకరిస్తూ, ఒక నెలలోపుగానే ఆ పాటలను అప్‌లోడ్ చేస్తున్నారు. Youtube వీడియో పాటల లింక్‌లకు కావలిసిన కోడ్‌ని ఇటీవలనే చేర్చారు. సూర్యగారి లాంటి మహోన్నత వ్యక్తి ఈ వెబ్‌సైట్ ద్వారా నాకు పరిచయం కావటం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను.

2006, 2007 సంవత్సరాలలో సూర్యగారు అత్యధికంగా పాటలను సేకరిస్తే, ఈ సంవత్సరం శాంతారాం గారు (బెంగుళూరు), కామేష్ కలపాల గారు (హైదరాబాద్) కలిసి దాదాపుగా 1000 పాటలను పంపించారు. ముఖ్యంగా శాంతారాం గారు చేస్తున్న సహాయం మరువలేనిది. ఇటీవలే దేవులపల్లి వారి "చీకటి వెలుగులు" సినిమా టైటిల్ సాంగ్‌ని విశ్లేషిస్తూ ఒక అద్భుతమైన ఆర్టికల్‌ని పంపారు. అది చదివిన తరువాత ఆయనలో ఒక పాతపాటల అభిమానే కాకుండా, ఒక మంచి భావకవి కూడా ఉన్నాడనే విషయం తేటతెల్లమయ్యింది. ఏజెంట్ 116 (మా డిస్కషన్ బోర్డ్‌ల ద్వారా నాకు పరిచయమయ్యిన మరో మంచి స్నేహితుడు) ద్వారా తెలిసిన మరో విషయమేమిటంటే, శాంతారాం గారే పాతబంగారం లాంటి వెబ్‌సైట్లకు అత్యధికంగా పాటలను అందిస్తారని.. దీన్ని బట్టి ఆయనకు కూడా మా ఇద్దరిలాగానే (సూర్యగారికి, నాకు) కనుమరుగవుతున్న పాత పాటలను అందరికీ అందించాలనే ఒక మహోన్నత ఆశయం ఉన్నట్లుగా సుస్పష్టమౌతున్నది. అలాగే కామేష్ గారు కూల్‌గూస్ లాంటి సైట్లలో చాల పాటలు అప్‌లోడ్ చేస్తారని తెలిసింది. ఇలాంటి like-minded స్నేహితుల సహాయ, సహకారాలు ఉన్నంత కాలం చిమటమ్యూజిక్ లాంటి వెబ్‌సైట్లు నిరాటంకంగా నడుస్తాయనిపిస్తుంది.

ChimataMusic.com
Patha Patala Paramaanandu

మీరంతా గత 7 నెలలుగా కొత్త హోమ్‌పేజిని చూస్తున్నారు కదా! Sand-Soft అనే వెబ్ డెవలప్‌మెంట్ కంపెనీ వారు స్వచ్చందంగా ముందుకి వచ్చి free గా కొత్త హోమ్‌పేజిని చేశారు. వీరి చేతనే శోభన్‌బాబు.కామ్ సైట్ కూడా డెవలప్ చేయించాము. కౌముది.నెట్ వారు ఏమాత్రం శ్రమ అనుకోకుండా హోమ్‌పేజి బ్యానర్‌ని అద్భుతంగా చేసి ఇచ్చారు. ఈ సంవత్సరం పాటల లిరిక్స్‌ని కూడా పాటలతో పాటుగా జత చెయ్యాలని నిర్ణయించాము. దీనికై నిషిగంధ, సిరిమల్లి గార్లు అందిస్తున్న సహాయం మరువలేనిది. ఎవరైనా కొత్త లిరిక్స్‌ని మాకు పంపాలనుకుంటే, transliterated Telugu లో టైపు చేసి మాకు (chimata.music@gmail.com) పంపండి.

గత సంవత్సరంతో పోలిస్తే, ఈసారి మనం ఆర్టికల్స్ విషయంలో వెనకపడ్డామనిపిస్తుంది. 2007లో నిషిగంధ, నందకిషోర్, హేమలత గార్లు చాలా చక్కని వ్యాసాలను రాశారు. 2008 లో ఒక్క సత్యభామ గారే రాశారు. ఇంతకు ముందే చెప్పినట్లుగా, శాంతారాం గారు ఇటీవల చాలా చక్కని వ్యాసం రాశారు. దాన్ని కూడా ఈ ఎడిటోరియల్‌తో పాటుగా అప్‌లోడ్ చేస్తున్నాను. వచ్చే సంవత్సరం లోపుగా ఇంకా చాలామంది మంచి ఆర్టికల్స్ తో ముందుకొస్తారనే ఆశాభావాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేస్తున్నాను.

ఈసారి చాలామంది సెలెబ్రిటీలు మన సైట్ గురించి తెలుసుకొని మాకు అభినందనలు తెలియచెయ్యడం ఒక మంచి అనుభూతిని మిగిల్చింది. ప్రఖ్యాత కూచిపూడి కళాకారిణి శోభానాయుడు గారు, ప్రముఖ రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణ గారు, హాసం రాజా గారు, వర్ధమాన సినీ జర్నలిస్టు పులగం చిన్నారాయణ, గాయని విజయలక్ష్మి గారు, సినీనటుడు శివారెడ్డి, **SP** కోదండపాణి గారి మనుమడు ఉదయ్ గారు, సినీ నటుడు ప్రదీప్ (ముద్దమందారం ఫేం) గారి ఫామిలీ మెంబర్స్.. వీరంతా ఒక ఎత్తయితే, స్వయానా **SP** బాలు గారు ఎంతో ఆప్యాయతతో కూడిన ఆశీర్వాదాన్ని నాకు అందించడం మరో ఎత్తు.

**SP** బాలు, చిత్ర గారి తెలుగు మ్యూజికల్ షోను సిలికాన్ వ్యాలీలో **BATA** వారు సెప్టెంబర్ 13న నిర్వహించడం, నేను దానికి ఒక **co-sponsor** గా వ్యవహరించడం జరిగింది. ఆ సందర్భంగా బాలు గారితో గంటల తరబడి తాను పాడిన కొన్ని పాటల గురించి, అలనాటి సంగీత దర్శకుల మరియు గీతరచయతల గురించి మూడు రోజుల పాటుగా సుధీర్ఘ చర్చలు జరపడం కేవలం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. బాలుగారికి అంతకు ముందే మన వెబ్‌సైట్ సంగతి తెలుసునన్న విషయం నన్ను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. తన సంగీత దర్శకత్వంలో రమేష్‌నాయుడు గారి చేత కొంగుముడి సినిమాకు పాడించుకున్న "రాదా.. మళ్ళీ వసంతకాలం" అనే పాట కోసం బాలు గారు ఎన్నాళ్ళనుంచో వెదుకుతూ చివరికి ఆ పాటని మన సైట్లో విన్నారని తెలిసినప్పుడు ఈ వెబ్‌సైట్ చరితార్థమయ్యిందని భావించాను. షో అయిపోయి, ఆయన ఇండియా వెళ్ళిన తరువాత ఆయన నుండి నా ఈమెయిల్ కు **reply** అందుకోవటం నాకు మిగిలిన మరో మధురానుభూతి. బాలుగారి సమక్షంలో నేను, నా స్నేహితులు (విజయ్ వేమూరి, ప్రసాద్ దూర్వాసుల గారు) గడిపిన జ్ఞాపకాలను ఒక వ్యాసం రూపాన మళ్ళీ మీ అందరితో పంచుకుంటాను.

గత 3 నెలలుగా గూగుల్ **Adsense** యాడ్స్ సైట్‌లో పెట్టడం జరిగింది. మిగతా మ్యూజిక్ వెబ్‌సైట్ల మాదిరిగా మాత్రం విసిగించే పాప్-అ ప్స్, పేజీల నిండా ఉండే **junk** యాడ్స్ లాంటివి మాత్రం మేము ఎట్టి పరిస్థితుల్లో పెట్టమని మీకు హామీ ఇస్తున్నాము. ఈ గూగుల్ యాడ్స్ ద్వారా వచ్చే ఆదాయం ఈ వెబ్‌సైట్ నిర్వహణకు సరిపోతుంది. కాబట్టి మీకు వీలు

చిక్కినప్పుడల్లా ఈ గూగుల్ యాడ్స్ మీద క్లిక్ చేసి ఈ సైట్ నిర్వహణకు మీరంతా పరోక్షంగా సహాయపడతారని ఆశిస్తున్నాము.

అప్పుడప్పుడు వెబ్‌సైట్ పనిమీద బిజీగా ఉండి నా భార్యా పిల్లలతో కొన్ని వీకెండ్స్‌లో **fun-time** కోల్పోతున్నందుకు కొద్దిగా బాధ కలిగినా, ఈ సైట్ ద్వారా కొన్ని వేలమంది తెలుగువారు తమ బాల్య స్మృతులని ఆనందంతో నెమరు వేసుకుంటున్నారని తెలిసి చాలా సంతోషం కలుగుతుంది. మీ అందరి ఆదరాభిమానాలే ఈ వెబ్‌సైట్‌కి శ్రీరామరక్ష. మేము మిమ్మల్ని కోరే సహాయం ఒక్కటే.... ఈ సైట్ మీకు బాగా నచ్చినట్లయితే, ఇంకో పదిమందికి ఈ సైట్ గురించి తెలియచెయ్యండి!

జైహింద్!!

*శ్రీనివాసరావు చిమట*
chimata.music@gmail.com
సిలికాన్ వ్యాలీ (**Fremont, CA**)
10/31/2008

ChimataMusic.com
Patha Patala Parnasala